క్లుప్తంగా

నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

నేరడిగొండ/బోథ్: మండల కేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా సోమ, మంగళవారాల్లో పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి దేవన్న ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి బుధవారం నుంచి కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జనవరి 1న శౌర్య దివస్



మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రంలో జనవరి 1న భీమా కోరేగావ్ 205వ శౌర్య దివస్ నిర్వహించనున్నట్లు అంబేద్కర్ అసోసియేషన్ ఉట్నూర్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జగ్జీవన్, కాంబ్లే ప్రజ్ఞశీల్‌లు తెలిపారు. భీమా కోరేగావ్ అమరవీరులకు నివాళులర్పించేందుకు దళిత, ఆదివాసీలు, బహుజనులు తరలిరావాలని కోరారు. సమావేశంలో స్వామి, బొంకంటి సుభాశ్, టిబోతే, అకాశ్, బండి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న గ్రామస్తులు

నేరడిగొండ: ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలవాలని మండలంలోని బుగ్గారం(బి) గ్రామ యువజన సంఘం సభ్యులు మొక్కుకున్నారు. అనిల్ జాదవ్ భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆదివారం పొరఘడ్ జగదాంబ దేవి, శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో మొక్కు తీర్చుకున్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణం

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కడ్తాల్ అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి పల్లకిని దర్శించుకున్నారు. అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొనడంతో అయ్యప్ప నామస్మరణంతో మార్మోగింది. ఎమ్మెల్యే వెంట బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వాములు ఉన్నారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

ఎదులాపురం: వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరిపారు. కేక్‌కట్ నాయకులు తినిపించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెందూర్ మనోహర్, కోఆర్డినేటర్ సర్సం రాహుల్, జిల్లా యువజన అధ్యక్షుడు కృష్ణంరాజు, మాణిక్ రావు, ఉగ్గే శ్రీను, విజయ్ శ్రీను పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

నేరడిగొండ: గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని సర్పంచ్ గీత అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే డ్రెయినేజీ శుభ్రతతో పాటు ఏ సమస్యలు ఎదురుకాకుండా చూస్తానని తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూసీ అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో జీపీ కార్మికుల సమ్మె సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందులో జీపీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆశన్న, యకులు అడెల్లు, పోశెట్టి లక్ష్మన్న, ఇంద్రజ, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

ఎదులాపురం: ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు జిల్లా కమిటీతో పాటు మండల కమిటీలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కదరపు ప్రవీణ్ మాదిగ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వివరాలు వెల్లడించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గజ్జల కాంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రమేశ్, ఊషన్న, బేల, జైనథ్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, బోథ్ మండలాల అధ్యక్షులుగా అక్షయ్, గజానన్, జయేందర్, పోశన్న, కృష్ణలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

జనసంద్రంగా వారసంత!



గుల్లలు, చాటలు బేరం చేస్తున్న ప్రజలు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కెరమెరి మండల కేంద్రంలో ఆదివారం వారసంత కావడంతో జనంతో కిక్కిరిసింది. తినుబండారాలు, చెరుకు విక్రయాలు చేస్తూ జనం సందడి చేశారు. చేపల మార్కెట్, హోటళ్లు, పండ్లు, కూరగాయల విక్రయ కేంద్రాలు రద్దీగా మారాయి. చాలా రోజుల తర్వాత వారసంత ప్రజలతో నిండిపోయింది. - కెరమెరి



చేపల మార్కెట్ వద్ద సందడి..



చెరుకు కొనుగోలు చేస్తున్న యువకుడు



స్వెట్టర్లు కొనుగోలు చేస్తూ..

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం: సాయి వైకుంఠట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత మగ్గం, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణను సద్వినియోగించుకోవాలని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్, మేనేజింగ్ డైరెక్టర్ వాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రస్ట్ భవనంలో ఆదివారం ఉచిత శిక్షణ ప్రారంభించారు. గత ఐదు ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 1500 మంది మహిళలకు ఉచిత మగ్గం, ఎంబ్రాయిడరీ, టైలరింగ్ శిక్షణ అందించడం జరిగిందన్నారు.

31న మేరు సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 31న మేరు సంఘం ఆదిలాబాద్ పట్టణ నూతన కార్యవరాన్నిఎన్నుకోనున్నట్లు సంఘం అడహక్ కమిటీ ఎన్నికల అధికారి రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. ఎన్నికలను ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో రుక్మిణి విఠలేశ్వర్ ఆలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 22 నుంచి నామినేషన్‌లు స్వీకరించడం జరుగుతుందన్నారు. 26న ఉపసంహరణ అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. 31న ఎన్నికలు, ఆదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఎన్నికల అధికారులుగా పోలిపెల్లి గజానన్, పోలిపెల్లి నాందేవ్‌లు వ్యవహరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

పక్కా భవనాల్లో కార్యకలాపాలు షురూ

- కొత్త మండలంలో అందుబాటులోకి ప్రభుత్వ కార్యాలయాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు
- ఇంకా అద్దెభవనాల్లో మరికొన్ని కార్యాలయాలు



నూతన కేజీబీవీ పాఠశాల



నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్

పెంచికల్‌పేట్: నూతనంగా ఏర్పడిన పెంచికల్‌పేట్ మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మండల విద్యాధికారి కార్యాలయం పూర్తి కాగా అయా కార్యాలయాల నుంచి అధికారులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిన ప్రభుత్వ కార్యాలయాలు పక్కా భవనాల్లోకి మారి సేవలు అందిస్తున్నాయి.

అద్దె భవనాల్లోనే పలు కార్యాలయాలు..

మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసి రైతులకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం రెండేళ్ల క్రితం రైతులకు సేవలు అందించేందుకు ధరణి భవన నిర్మాణ పనులు ప్రారంభించగా ఇటీవలే పనులు పూర్తయ్యాయి. ఎల్కపల్లి గ్రామంలోని అంబేద్కర్ భవనంలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఫారెస్టు సెక్షన్ అధికారి క్వార్టర్‌లో రేంజ్ కార్యాలయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మండలవాసులు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



నూతన మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించారు. పలు కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నూతన మండలంలో ఇంకా నిర్మాణం పూర్తి కాని కార్యాలయాలకు నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలను పూర్తి చేయాలి.

- పి.సుగుణాకర్, పెంచికల్‌పేట్

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ!



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీలోని పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీవాసులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వెడ్మ బొజ్జుకు సన్మానం

కెరమెరి: ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జును మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం జోడేఘాట్‌ను సందర్శించారు. కుమురంభీంకు నివాళులర్పించారు. సమాధికి పూజలు చేశారు. జోడేఘాట్‌లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సన్మానం చేసిన వారిలో సాజిద్ దేశ్‌ముఖ్, మిలింద్, ఆర్.సాగర్, వెంకట్, ముస్తఫా, మారుతి, రైఫ్ తదితరులు ఉన్నారు.

జైనూర్‌లో..

జైనూర్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను జైనూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం వెడ్మ బొజ్జు జోడేఘాట్‌కు వెళ్తుండగా జైనూర్‌లో ఆగి మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ నాయకులు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు ఆయ్యుబ్‌ఖాన్, ఆదివాసీ నాయకులు ఆత్రం శంకర్, ఆత్రం దత్తు, తదితరులు ఉన్నారు.



వెడ్మ బొజ్జును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'స్థానిక జిల్లాలకు పంపించండి'

కెరమెరి: స్థానిక జిల్లాలకు పంపించి తమకు న్యాయం చేయాలని మండలంలోని పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 317 బాధిత ఉపాధ్యాయులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు విన్నవించారు. ఆదివారం కెరమెరికి వచ్చిన ఆయనకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం స్థానికత గుర్తించకుండా ఇష్టం వచ్చిన రీతిన బదిలీలు చేపట్టిందని, దీంతో కుటుంబ సభ్యులకు దూరమవుతున్నామని వాపోయారు. సమస్య సీఎం దృష్టిలో ఉందని అసెంబ్లీ సమావేశాలు పూర్తి కాగానే సంఘ నేతలతో మాట్లాడి న్యాయం చేస్తామని వెడ్మ బొజ్జు భరోసా కల్పించారు. టీచర్లు శ్రీధర్, సురేశ్, వినత్, హరీశ్, యోగేశ్, క్రాంతి తదితరులు ఉన్నారు.



బొజ్జుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

అదుపుతప్పి లారీ బోల్తా

ఆసిఫాబాద్‌రూరల్: అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఆదివారం ఆసిఫాబాద్ నుంచి పత్తి లోడుతో హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో మోతుగూడ సమీపంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

భక్తిశ్రద్ధలతో బోనాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో మల్లన్న దేవునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కొత్త బియ్యం, బెల్లంతో నైవేద్యం తయారు చేసి దేవునికి భక్తులు సమర్పించారు. కాగజ్‌నగర్ మండలంతో పాటు మంచిర్యాల, ఆసిఫాబాద్, పెంచికల్‌పేట, సిర్పూర్ (టి) ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బోనాలు సమర్పించారు. దీంతో ఈజ్‌గాం దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయ ఆవరణలో జాతర నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ వేణుగోపాల్ గుప్తా చర్యలు తీసుకున్నారు. ఈజ్‌గాం పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



హారతి తీసుకుంటున్న భక్తులు



మొక్కులు చెల్లించేందుకు క్యూలో భక్తులు



కాయిన్‌లు అతికిస్తున్న చిన్నారులు, భక్తులు



బోనాలకు పూజలు చేస్తున్న భక్తులు



అభిషేకం నిర్వహిస్తున్న పూజారి

గంగోత్రి పాదయాత్ర భక్తులకు పండ్లు పంపిణీ

బెల్లంపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రం గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఆదివారం బెల్లంపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ సాదర స్వాగతం పలికి పండ్లు పంపిణీ చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహంకాళి అమ్మవారి భక్తులు శివ నారాయణ్, ప్రేమ్ నారాయణ్, రామ్‌సింగ్, భూపెన్‌సింగ్, గంగోత్రి జలాలతో గత అక్టోబర్ 15న పాదయాత్రగా బయలు దేరారని తెలిపారు. వెంట తీసుకెళ్తున్న గంగోత్రి గంగాజలాన్ని రామేశ్వరంలోని ఆలయంలో కలపనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పాదయాత్ర చేస్తున్న భక్తులను శాలువాతో సన్మానించి అభినందించారు. అన్నదానం చేశారు. బీజేపీ నాయకులు కేశవరెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అనుకుంట గ్రామంలో గల పురాతన పద్మావతి అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు పూర్ణకుంభంతో, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తమ గ్రామం నుంచి ఎడ్లబండ్లతో గ్రామస్తులందరం వచ్చే వాళ్లమని గుర్తుచేసుకున్నారు.

మహాపడిపూజ

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శనివారం రాత్రి అనిల్ చల్లావార్ స్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరుకు చెందిన సుబ్బారావు గురుస్వామి స్వామివారికి పూజలు నిర్వహించగా.. నిజామాబాద్‌కు చెందిన భజన బృందం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని నృత్యం చేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాంసి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ కోరారు. భారత్ సంకల్ప వికాసిత్ యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని పొన్నారి, పాలోది గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులకు మౌలిక సదుపాయాల కోసం అమలు చేస్తున్న ఉజ్వలయోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం జన్‌ధన్ యోజన, వైద్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, అశోక్, ఎంపీటీసీ రఘు, డీఆర్‌డీఏ అధికారి మజీద్, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.